క్లుప్తంగా

'బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న బాల్‌రాజు, తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి హితవు పలికారు. ఆదివారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తాము పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉండి తెలంగాణ ఆడబిడ్డపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ బేషరతుగా కవితకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందాపురం మల్లేశం, సర్పంచ్ రంగన బోయిన రాములు, మాజీ ఎంపీటీసీలు ధార స్వామి, గొట్టం బైరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ధర్మారం కుమార్, రాధాకృష్ణ, రాములు, స్వామి, మల్లయ్య, చంద్రం, కిష్టయ్య పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



భవనాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య, తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): అందివచ్చిన వనరులను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో నూతన మహిళా సమాఖ్య భవనాన్ని సర్పంచ్ బక్కి భాగ్యలక్ష్మితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎంపీటీసీ అబ్బుల ఉమారాణిబాలాగౌడ్, ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎర్మని దుబ్బరాజం, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐతం శ్రీనివాస్, నాయకులు జెన్నారెడ్డి, సాయిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లింగం, నాగరాజు, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అలిరాజీపేట గ్రామంలో కొత్తమీరాబాయి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు.


మూఢనమ్మకాలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో సీపీ శ్వేత ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై, సైబర్ నేరాలపై కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నారాయణ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి ఎంతో మంది డబ్బులు పోగొట్టుకున్నారన్నారు. అలాగే మూఢనమ్మకాలను విడనాడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడా సామగ్రిని అందిస్తున్న నర్సింహారెడ్డి

దుబ్బాక: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాయపోల్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రాయపోల్ మండలం వీరానగర్ గ్రామంలో యువకులకు వాలీబాల్ క్రీడా సామగ్రిని అందజేశారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో యువకులు, తదితరులున్నారు.

ఇరుకు గదుల్లో.. ఇంకెన్నాళ్లు?

- అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- అరకొర వసతులతో ఇక్కట్లు
- ఎనిమిదేళ్లయినా.. పట్టించుకోని వైనం



అద్దె ఇంట్లో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

అక్కన్నపేట(హుస్నాబాద్): పరిపాలనా సౌలభ్యం కోసం 2016లో ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. కానీ అక్కన్నపేట మండలంలో మాత్రం ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. స్థలాలు గుర్తించిన నిధులు లేక పనులు ప్రారంభం కాలేదు. మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయాన్ని ఓ ప్రైవేట్ అద్దె ఇంట్లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న మూడు తరగతి గదులను మరమ్మతులు చేసి అందులో మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అదేవిధంగా వ్యవసాయ కార్యాలయం ఏర్పాటు చేయలేదు. ఐకేపీ కార్యాలయం మండల కేంద్రంలోని మహిళా సంఘ భవనంలో కొనసాగుతోంది. పోస్టాఫీసుకు అద్దె భవనం అందుబాటులో దొరకకపోవడంతో గ్రామ పంచాయతీ భవనంలోనే ఒక గదిని ఏర్పాటు చేశారు.

తప్పని తిప్పలు..

సొంత భవనాలు లేకపోవడంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇరుకు గదుల్లో పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి హరీశ్‌రావుకు విన్నవించాం..



సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు విన్నవించాం. మండల కేంద్రంలోని 387 సర్వే నంబర్‌లో దాదాపు 15 ఎకరాల్లో సమీకృత భవనాల నిర్మాణానికి స్థల సేకరణ సైతం చేశాం. అభివృద్ధి చెందాలంటే పూర్తిస్థాయి అధికారులు, కార్యాలయాలు ఉండాలి. – మాలోతు లక్ష్మి, ఎంపీపీ

సమీకృత భవనం నిర్మించాలి



ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందాలంటే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకచోట ఉండేలా సమీకృత భవనం నిర్మించాలి. మండలం ఏర్పాటు చేసి ఏళ్లు అవుతున్నా.. ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించలేదు. మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌లు ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయాలి. – తిరుపతినాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు

నిధుల మంజూరుపై హర్షం



ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని విశాలాక్షి సమేత శరభేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం హరిహరపుత్ర అయ్యప్పస్వామి భక్తులు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం శబరిమలైలో తెలంగాణ అయ్యప్ప భక్తుల కోసం వసతి గృహ నిర్మాణ ఏర్పాటు చేయడానికి రూ.25కోట్లు మంజూరు చేయడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూ దేవాలయాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రరావు, వెంకట్, రాజు, మహేశ్, రాము, విద్యాసాగర్, మల్లికార్జున్, శ్రీకాంత్, బాలకిషన్, నరసింహులు, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో పంటపొలాలు సస్యశ్యామలం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దుబ్బాక: గోదావరి జలాలతో పంట పొలాలను సస్యశ్యామలం చేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కోనాపూర్ సర్పంచ్ పంచమి స్వామి అన్నారు. దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామ చెరువులోకి గోదావరి జలాలను వదలడంతో చెరువు నిండి మత్తడి దూకుతుంది. దీంతో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుటెండలో సైతం చెరువులు మత్తళ్లు దూకుతున్నాయని, రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు స్వామి, బాల్‌నర్సయ్య, మహిపాల్, రమేశ్, యాదగౌడ్, తదితరులున్నారు.

సాగునీటితో రైతుల్లో సంతోషం



రాజగోపాల్ పేట పెద్దచెరువులో జలహారతి

నంగునూరు(సిద్దిపేట): నంగనూరు మండలం రాజగోపాల్‌పేట పెద్ద చెరువులో ఆదివారం సాయంత్రం గంగమ్మకు జలహారతి కార్యక్రమం నిర్వహించారు. మిషన్ కాకతీయ ప్రారంభించి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా పెద్ద చెరువులో ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగమ్మకు జలహారతి నిర్వహించారు. గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సారయ్య, పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షులు కిష్టారెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్: జలహారతి కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

సిద్దిపేటరూరల్: కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ప్రతీ యాసంగిలో రైతులు సాగు చేస్తున్న వరి పంటలకు సమయానుకూలంగా సాగునీటిని అందించడం ద్వారా రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ కార్యక్రమం 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు ఆదివారం రావురూకులలో జలహారతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా రాష్ట్రంలోని అన్ని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టిందన్నారు. ప్రాజెక్టుల ద్వారా గ్రామాల్లోని చెరువులకు నీటిని విడుదల చేయడం ద్వారా చెరువులు నిండుకుండలా మారుతున్నాయన్నారు. దీంతో రైతులకు పంటల సాగుపై ఎలాంటి ఆందోళన లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, వైస్ ఎంపీపీ యాదగిరి, సర్పంచ్ కవితరవీందర్, ఉపసర్పంచ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శవపేటిక వితరణ



శవపేటిక ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: అసోసియేషన్ ఆఫ్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 137బీ కరీంనగర్, హుస్నాబాద్ అలయన్స్ క్లబ్ హుస్నాబాద్ డైమండ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చేతుల మీదుగా మున్సిపల్ పరిధిలోని ప్రజలకు శవపేటిక (డెడ్ బాడీ ఫ్రీజర్) వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మృతదేహాలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఎదురుచూస్తున్న సందర్భంలో డెడ్ బాడీ ఫ్రీజర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులను అభినందిస్తూ మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, డిస్ట్రిక్ గవర్నర్ మోర అంజయ్య, కేబినేట్ ట్రెజరర్ దూడం నాగభూషణం, లయన్స్ క్లబ్ ఆఫ్ సిద్దిపేట జోజి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబొయిన రజని తిరుపతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, క్లబ్ సభ్యులు లక్ష్మిపతి, వెల్దండి బాలయ్య, చింతకింది శ్రీనివాస్, వీరసోమయ్య పాల్గొన్నారు.

నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన అన్నాడి శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దబ్బెట శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లమ్మకు బంగారు ఆభరణాల వితరణ



ఆలయంలో పూజలు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ కుటుంబసభ్యులు

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్ లక్ష్మి దంపతుల కుమార్తె, అల్లుడు చందన సందీప్‌లు 10 గ్రాముల బంగారు ఆభరణాలు బహూకరించారు. 10 గ్రాముల మిశ్రమంతో అమ్మవారికి రాళ్లు పొదిగిన బొట్లు బిళ్ల, ముక్కు పుడక సమర్పించారు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుంది. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు తాటికొండ పరమేశ్వర్‌శర్మ, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, హనుమంత్, రమేశ్ పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో పూజలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సర్పంచ్

దుబ్బాకరూరల్: మండలంలోని రఘోత్తంపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మహంకాళి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దేవిరెడ్డి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

విద్యార్థులను వేధించొద్దు



మాట్లాడుతున్న జనార్దన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వార్షిక పరీక్షల నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు హాల్ టికెట్ల కోసం విద్యార్థులను ఫీజుల విషయంలో వేధించొద్దని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్చి 15న ఇంటర్, ఏప్రిల్ 3న పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయని, ఫీజు చెల్లించని విద్యార్థులపై ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఒత్తిడి చేయొద్దని కోరారు. ఇంటర్మీడియట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలే తప్పా.. విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సిద్దుల సుమన్, నాయకులు ప్రవీణ్, జనిత్, ఆదిత్య, రంజిత్ తదితరులు ఉన్నారు.

కుటుంబపాలనకు చరమగీతం పాడాలి

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్న కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సభ్యుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా కొమురవెల్లి, గౌరాయపల్లి, మర్రిముచ్చాల, లెనిన్‌నగర్, కిష్టంపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలసి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే ఇంటికొక ఉద్యోగం ఇస్తామన్న మాట ఏమోగానీ తన ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. అవినీతికి పాల్పడితే ఎవరినైనా శిక్షిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ తన కూతురు కవిత ఢిల్లీలో లిక్కర్‌స్కామ్‌కు పాల్పడితే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. స్థానికేతరుడైన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రజా సమస్యలు గాలికి వదిలేసి భూకబ్జాలు చేస్తున్నాడన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, మాజీ ఎంపీపీ బుడిగె నర్సింహులు, ఎంపీటీసీలు కవిత, రాజమణి, కనకరాజు, కొయ్యడ శ్రీనివాస్, వల్లాద్రి అంజిరెడ్డి, తురాయి నవీన్‌గౌడ్, బుడిగే ఐలేని, పుల్లం భిక్షపతి, జంగని రవి, పంజాల మురళి, దేశయ్య పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజు ఆదివారం ఉదయం గురుప్రార్థన, గోపూజ, శాంతి పాఠము, స్థాపిత దేవతా ప్రాతఃకాలపూజ, జప పారాయణములు, నవగ్రహ మండల దేవతాహోమం, మూర్తి మూర్త్యధిపతి లోకపాలదేవతాస్థాపన హోమం, ప్రధాన దేవతా, ఇతర దేవతా మూల మంత్ర హవనం, ధాన్యాధివాసం, శిఖర ధ్వజ సంస్కారములు తదితర పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు రుక్మాభట్ల కృష్ణమూర్తి, విఠాల సాయికృష్ణశర్మ, దేశపతి రాజశేఖరశర్మ, ఆలయ అర్చకులు బీటుకూరి శ్రీనివాసాచార్యులు, మఠం శివకుమార్, నవీన్‌లతో పాటు వాడనందబాలశర్మ, వేదపండితుల ఆధ్వర్యంలో వైష్ణవ, శైవ సంప్రదాయాల్లో నిర్వహించారు. అదేవిధంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్నేహితురాలి పిల్లలకు చేయూత



బాండ్‌ను అందిస్తున్న స్నేహితులు

సిద్దిపేటరూరల్: కలిసి చదువుకున్న స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి తోటి స్నేహితులు ఔదార్యం చాటుకున్నారు. నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన నరసన్న పద్మ గత నెలలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది. దీంతో పిల్లలు అనాథలుగా మారారు. పద్మతో పాటు పాఠశాలలో చదువుకున్న 1999-2000 సంవత్సరం బ్యాచ్ స్నేహితులంతా కలిసి తన స్నేహితురాలి పిల్లలను ఆదుకోవాలనే ఆలోచనతో లక్ష రూపాయలు పద్మ కూతురు శ్వేత పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వస్తున్న భక్తులు



బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్లలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహాలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గ్రామ దేవతలకు బోనాలతో మొక్కులు సమర్పించారు. గ్రామంలో దాదాపు 600 కుటుంబాలు బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నట్లు సర్పంచ్ తోడేటి రమేశ్ తెలిపారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల సిగాలతో బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోహెడరూరల్: విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో 1991-92 చదివిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకచోట కలిసి సందడి చేశారు. 31 ఏళ్ల తర్వాత ఒకరికొకరు కలిసి యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎడబోయిన సత్తయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ ఐలయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, అక్కెనపల్లి సర్పంచ్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళామణుల ఆత్మీయ సమ్మేళనం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం బెజ్జంకిలోని సత్యార్జున ఫంక్షన్ హాల్‌లో మహిళామణుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని మహిళలను సన్మానించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం గతంలో బెజ్జంకిలో జరుపుకున్నారు. ఇప్పుడు కేవలం మహిళా విద్యార్థులను సన్మానించి సత్కరించడానికి ప్రత్యేకంగా వేడుకలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.



బెజ్జంకి(సిద్దిపేట): సమ్మేళనంలో మహిళలు